సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



రైతు నేత మనోహర్‌రెడ్డి మృతి

రైతు సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిన మనోహర్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు.

- 10లో ▸



ప్రత్యేక పూజలు

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మొక్కజొన్న@ రూ.2,424



పెర్కిట్(ఆర్మూర్): మార్కెట్‌లో మొక్కజొన్న పంటకు మంచి ధర వస్తోంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ డైరెక్టర్ మూడ అశోక్ మొక్కజొన్న పంటను నిజామాబాద్ గంజ్‌లో విక్రయించగా క్వింటాకు రూ.2,424 ధర లభించింది. పంట కొనుగోళ్ల ప్రారంభంలోనే అధిక ధర రావడంపై రైతు ఆనందం వ్యక్తం చేశాడు. గత యాసంగి సీజన్‌లో మొక్కజొన్న అత్యధికంగా రూ.2,300 పలికింది. తాను రెండు ఎకరాల్లో పండించిన 60.5 క్వింటాళ్ల మొక్కజొన్నకు రూ.1.46 లక్షలు వచ్చినట్లు రైతు తెలిపారు.

ఆదర్శ పాఠశాలల టీచర్లకు బదిలీలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల టీచర్లను ప్రభుత్వం బదిలీలు చేసింది. జిల్లాలో 16 మోడల్ స్కూళ్లలో 147 మంది టీచర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మాట తప్పిన ప్రభుత్వానికి ధర్నాలతో నిరసన

- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు



ఆర్మూర్: ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాట తప్పడంతో ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా రైతులు ధర్నాలు నిర్వహించి నిరసన తెలపాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లోని అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం కమిటీ ప్రతినిధులు వి ప్రభాకర్, లింగారెడ్డి, దేగాం యాదాగౌడ్ మాట్లాడారు. సోమవారం డివిజన్ పరిధిలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రైతులకు సూచించారు. షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ, రెండు పంటలకు రైతు భరోసా రూ.15 వేలు, వరి పంటకు రూ.500 బోనస్ యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బి దేవారాం, ఆకుల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక




దోమకొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం దోమకొండలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే కరాటే క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలలో ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన 90 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 45 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్, 45 మందికి సిల్వర్ మెడల్ సాధించారని కరాటే గ్రాండ్ మాస్టర్ రాజయ్య తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. కామారెడ్డి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఈశ్వర్, జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నరసింహారెడ్డి, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సాయి మౌర్య, పీఈటీలు శ్రీధర్, కమిటీ మెంబర్ శ్రీరేఖ, నాగరాజు, ఉదయ, సతీష్ పాల్గొన్నారు.

కొరడా ఝుళిపిస్తేనే!

అక్రమార్కులైన అధికారులపై కొరడా ఝుళిపిస్తేనే ఆక్రమణలు ఆగుతాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కళ్లముందే ఆక్రమణలు కనపడుతున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగుతోందంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసిన కొందరు కిందిస్థాయి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులే ఏకంగా బినామీలను పెట్టుకుని విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఆస్తులు కూడబెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- ఆక్రమణలు ఆగుతాయంటున్న ప్రజలు
- అక్రమ వ్యవహారాల్లో అధికారుల పాత్రపై ప్రజల్లో చర్చ
- నగరంలో నిబంధనలను తుంగలో తొక్కి నిర్మాణాలకు అనుమతులిచ్చిన టౌన్‌ప్లానింగ్ విభాగం
- ముడుపులివ్వనిదే ఒక్క ఫైల్ కూడా ముందుకు కదలని దుస్థితి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హైదరాబాద్‌లో హైడ్రా చేపడుతున్న కూల్చివేతలు జిల్లాల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. జిల్లాల్లోనూ హైడ్రా మాదిరి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో నిజామాబాద్‌లో ఈ విషయమై ప్రజల్లో చర్చ జరుగుతోంది. అయితే అక్రమాలకు పాల్పడిన అధికార యంత్రాంగంపై కొరడా ఝుళిపిస్తేనే ఈ ఆక్రమణలు ఆగుతాయని ప్రజలు అంటున్నారు. ఆక్రమణలు కళ్లముందే కనపడుతున్నప్పటికీ వాటిని ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో.. ఈ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగింది. అయితే ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై, ఇతర చోట్ల ప్రభుత్వ ఫీజులకు గండికొట్టేలా నిబంధనలు అతిక్రమించి ముడుపులు దండుకోవడమే పరమావధిగా పనిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు భారీగా వస్తున్నాయి. ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించకుండా అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటేనే తగిన పాఠం నేర్పినట్లవుతుందని పలువురు అంటున్నారు.

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసిన కొందరు కిందిస్థాయి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులే ఏకంగా బినామీలను పెట్టుకుని విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఆస్తులు కూడబెట్టుకున్నారు అంటే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బృందాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యాచరణతో నగరంలోని ప్రతి వీధిలో ఆయా నిర్మాణాలకు సంబంధించి తనిఖీలు చేస్తే నిబంధనలు ఉల్లంఘించి కట్టిన నిర్మాణాలు, వీటికి ఏవిధంగా అనుమతులు ఇచ్చారనే అంశాలు బయటపడతాయి. అదేవిధంగా పన్నుల వసూళ్లలో సైతం అసెస్‌మెంట్‌లో భారీ తేడాలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అధికారులు ఉన్నారు. పైగా ఈ అధికారులు రాజకీయ నాయకులను విమర్శిస్తూ తామేదో నీతిమంతులమన్నట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

■ రాజకీయ నాయకులు పార్టీ నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పటికీ తాము పుట్టిన ప్రాంతానికి ఏదైనా అభివృద్ధి కార్యక్రమం, పథకం, ప్రాజెక్టులు, సంస్థలు తీసుకురావాలనే లక్ష్యంతో వ్యవహరిస్తుంటారు. రాజకీయ నాయకులు ప్రేమతో కూడిన స్వార్థాన్ని చూపుతుంటారు. తద్వారా నాలుగు కాలల పాటు రాజకీయాల్లో ఉండాలనే తపనతో వ్యవహరిస్తుంటారు. ప్రజల్లో నిరంతరం పలుకుబడి ఉండేందుకు గాను, ఎదగాలనే తపన, మళ్లీ గెలవాలనే ఆకాంక్షతో అడుగులు వేస్తుంటారు. తాము పుట్టిన ప్రాంతంపై ప్రేమ చూపిస్తుంటారు. యువనాయకుల నుంచి వృద్ధ నేతల వరకు ఇదే వైఖరితో ఉంటారు. నాయకులు తీసుకొచ్చిన అభివృద్ధి నిధుల్లో సైతం భారీగా ముడుపులు తీసుకునే అధికారులు వారిపైనే విమర్శలు చేస్తుండడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా నిజామాబాద్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కొన్ని విభాగాల అధికారులు, సిబ్బంది లీలలు చూస్తే తెలుస్తుంది. తామేదో నీతిమంతులమన్నట్లు కలరింగ్ ఇస్తుండడం విశేషం. ఆస్తులు పోగొట్టుకున్న నాయకులు ఎక్కువగా కనిపిస్తుంటారు తప్ప అధికారులు కనపడకపోవడం సైతం గమనించాల్సిన అంశమే.

■ నిజామాబాద్‌కు పసుపు బోర్డు తెచ్చే విషయంలో ఎంపీ అర్వింద్, నిజాం షుగర్స్ తెరిపించే విషయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలోనూ దివంగత వైఎస్సార్ సహకారంతో ధర్మపురి శ్రీనివాస్ నిజామాబాద్‌లో వైద్య కళాశాల, తెలంగాణ వర్సిటీ తీసుకొచ్చారు. ఇక జిల్లాలో అప్పటి స్పీకర్, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం గంగారెడ్డి, మాజీ మంత్రి శనిగరం సంతోష్‌రెడ్డి వివిధ అభివృద్ధి పథకాలు, ఎత్తిపోతల పథకాలు తీసుకువచ్చారు. అయితే జిల్లాలో యంత్రాంగంపై పూర్తి పెత్తనం ప్రదర్శించే ఉన్నతాధికారులు మాత్రం తాము పనిచేస్తున్న ప్రాంతానికి మేలు చేయాలనే ఆలోచన అనేదే లేకుండా వ్యవహరిస్తున్నారని, దీంతోనే ఆక్రమణలు, కబ్జాలు ఇష్టం వచ్చినట్లు ప్రోత్సహిస్తున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మార్గంలో అనుమతులు ఇవ్వడం.. నాయకులను విమర్శించడం ఫ్యాషన్‌గా మారిందని ఆరోపిస్తున్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటేనే ఫలితం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

ధాన్యం దించుకోం..

- మెలిక పెట్టిన రైస్‌మిల్లర్లు
- సన్న రకాల్లో సీఎంఆర్ రాదని నిర్ణయం
- పౌరసరఫరాలశాఖ, కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు తెలిపిన వైనం

సుభాష్‌నగర్: వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని దించుకోబోమని రైస్‌మిల్లర్లు మెలికపెట్టారు. ఈ విషయాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసి నేరుగా లేఖలు అందజేయగా, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపించారు. పంట మరో నెలరోజుల్లో చేతికందుతుంది. ఈ తరుణంలో రైస్‌మిల్లర్లు ధాన్యం దించుకోబోమని ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సన్నరకాలకు బోనస్ ప్రకటించడంతో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో 4.30లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సా గు చేశారు. అందులో 3.67 లక్షల ఎకరాల్లో సన్నరకాలు, మిగతా 63వేల ఎకరాల్లో ఇతర రకాలు సాగైంది. ఈక్రమంలో పౌరసరఫరాల సంస్థ అధికారులు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధంచేశారు. సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సొసైటీలు, మెప్మా, ఐడీసీఎంఎస్, ఐకేపీ ద్వారా సేకరిస్తామని రాష్ట్ర కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. అందులో 7 లక్షల మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.



ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు(ఫైల్)

రైస్‌మిల్లర్ల కీలక నిర్ణయం!

వానాకాలం సీజన్‌కు సంబంధించి మరో నెల రోజుల వ్యవధిలో పంట చేతికొస్తుంది. జిల్లా వ్యాప్తంగా 310కిపైగా రా, బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. అయితే రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని దించుకోబోమని తేల్చిచెప్పింది. సన్నరకం ధాన్యంలో 67 కిలోల బియ్యం రావని, సీఎంఆర్ ఇస్తే తీవ్రంగా నష్టపోతామని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది. అడ్వాన్స్‌డ్‌గా బియ్యం ఇచ్చి.. వాటికి సరిపడా ధాన్యం తర్వాత తీసుకుంటామని నిర్ణయించింది. అప్పటివరకు వడ్లను ప్రభుత్వ ఆధ్వర్యంలోని గోదాముల్లో నిల్వ చేసుకోవాలని సూచించింది. రైస్‌మిల్లర్ల ప్రతిపాదనకు ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

కొనుగోళ్లు చేపడుతాం..



రైస్‌మిల్లర్లు ధాన్యం దించుకోబోమనే అంశం మా దృష్టిలో లేదు. ఉన్నతాధికారులను కలిసి చెప్పినట్లు మీడియాలో చూశాం. ఆ అంశంలో ప్రభుత్వం, ఉన్నతాధికారుల నిర్ణయానుసారం వ్యవహరిస్తాం. రైస్‌మిల్లర్లు దించుకోకున్నా.. ధాన్యం కొనుగోళ్లు మాత్రం కొనసాగుతాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – అరవింద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

మార్కెట్ యార్డుకు సెలవులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును వరుస సెలవుల కార ణంగా బంద్ ఉంచుతున్నట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఆదివారం, 16న మిలా ద్-ఉన్-నబి, 17న వినాయక నిమజ్జనం, 18న జెండా బాలాజీ జాతర సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. పైన తెలిపిన తేదీల్లో రైతులు మార్కెట్‌యార్డుకు సరుకులు తీసుకురావద్దని కోరారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్/మోపాల్: హాస్టల్, రెసిడెన్షియల్ విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. శనివారం నగరంలోని వినాయకనగర్‌లోగల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, మోపాల్ మండలం కంజర్ మహాత్మ జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యత, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బోధనా సిబ్బంది హాజరు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, బోధన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవన సముదాయం, డార్మెటరీని సందర్శించారు. వినాయక్‌నగర్ సంక్షేమ వసతి గృహానికి చెందిన విద్యార్థినులు బోర్గాం(పి) పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు రవాణా వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని, బడి వేళల్లో ఉదయం, సాయంత్రం బస్సు సదుపాయం కల్పించాలని హాస్టల్ నిర్వాహకులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి నిర్మల, సహాయ సంక్షేమ అధికారి భూమయ్య, మోపాల్ ఎంపీడీవో రాములు తదితరులున్నారు.



కంజర్ బీసీ బాలుర రెసిడెన్షియల్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మొక్కు తీరిన వేళ

- తండ్రి ఎమ్మెల్యే కావడంతో ముడుపు విప్పిన సుచరితరెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): తన తండ్రి పైడి రాకేశ్‌రెడ్డి ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని సుచరితరెడ్డి గతేడాది వినాయక చవితి సందర్భంగా డొంకేశ్వర్‌లోని సత్య (కర్ర) గణపతి వద్ద ముడుపు కట్టారు. రాకేశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో శనివారం గణపతిని దర్శించుకున్న సుచరిత రెడ్డి పోయిన ఏడాది కట్టిన ముడుపును విప్పారు. తీసిన ముడుపును గణపతి వద్ద ఉంచి మొక్కును చెల్లించుకున్నారు. కోర్కెలు తీరుస్తాడనమే నమ్మకంతో కర్ర గణపతి వద్ద ఎంతోమంది భక్తులు ముడుపులు కట్టడం ఆనవాయితీగా మారింది.



ముడుపును తీస్తున్న పైడి సుచరిత రెడ్డి

అట్టహాసంగా సౌత్‌జోన్ సైక్లింగ్ టోర్నీ

- క్రీడాభివృద్ధి కోసమే ఖేలో ఇండియా : ఎంపీ అర్వింద్
- జెండా ఊపి పోటీలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే ధన్‌పాల్
- నేడు ముగింపు వేడుకలు



సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ నాగారం: నగరంలో ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ రోడ్ సౌత్‌జోన్ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి భూలోకం విజయకాంత్‌రావు ఆధ్వర్యంలో కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మహిళల క్రీడాభివృద్ధికి ఖేలో ఇండియా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా బాలికలు, మహిళలు సైక్లింగ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సౌత్ జోన్ సైక్లింగ్ పోటీలు నిజామాబాద్‌లో నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తు అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఆదివారం కూడా టోర్నీ కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ నిషావిద్యార్థి, సైక్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీ కృపాకర్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్‌సుబేదార్, నర్సింగ్‌రావు, సూర్యప్రకాష్, వెంకట్ నర్సయ్య, ఎమ్‌కే పాషా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

సైక్లింగ్ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో కర్ణాటకకు చెందిన కోల్క చావన్ బంగారు పతకం, దీపిక ఫెడరేట్ రజతం, జ్యోతి రాథోడ్ కాంస్యం సాధించారు. జూనియర్ విభాగంలో పాయల్‌చావన్ పసిడి, కీర్తి నాయక రజతం, అయేషమోమిన్ కాంస్యం గెలుపొందారు. సీనియర్ మహిళా విభాగంలో నంద చిస్‌చకాండీ పసిడి, దానమ్మగౌవర్ రజతం, అక్షత భూతనాల్ కాంస్యం పతకాలు సాధించారు.

ఐదేళ్లుగా సాధన చేస్తున్నా



మాది కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోర్టు జిల్లా. ఐదేళ్లుగా సైక్లింగ్ క్రీడలో సాధన చేస్తున్నా. కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో నా లుగు, జాతీయస్థాయిలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించా. అండర్–18 విభాగంలో భారత జట్టు తరఫున మలేషియాలో రాణించాను. – నందచిస్‌చకాండీ, సైక్లింగ్ అంతర్జాతీయ క్రీడాకారిణి

జాతీయస్థాయిలో మెడల్స్ సాధించాను



మాది కర్ణాటక రాష్ట్రం. రాష్ట్ర, జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో రాణిస్తున్నాను. సౌత్ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. జిల్లాలో సౌకర్యాలు, సదుపాయాలు బాగా ఉన్నాయి. ఈ రోజు జరిగిన పోటీల్లో రజత పతకం సాధించాను. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తాను. – కీర్తినాయక, జాతీయస్థాయి సైక్లింగ్ క్రీడాకారిణి

సంతోషంగా ఉంది



మొదటి సారి జిల్లాలో సౌత్‌జోన్ ఉమెన్స్ లీగ్ టోర్నీ నిర్వహిస్తున్నాం. ఖేలో ఇండియా టోర్నీకి భోజన సౌకర్యం ఉండదు. క్రీడాకారులకు, కోచ్‌లకు వసతి విషయంలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. 300 మందికి పైగా క్రీడాకారులు రావడం సంతోషంగా ఉంది. – విజయకాంత్‌రావు, సైక్లింగ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్ నాగారం: సీజనల్ వ్యాధులపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆదేశించారు. శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై మలేరియా సబ్ యూనిట్ అధికారులు, నోడల్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి సర్వే జరపాలన్నారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే ఆ పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారి చేయాలని సూచించారు. యాంటీ లార్వా మెజర్స్ పకడ్బందీగా నిర్వహించాలని, డెంగీ నియంత్రణలో ఎవరు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటక జనితా వ్యాధుల నియంత్రణ అధికారి తుకారాంరాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్ట్ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నేడు పీఆర్‌టీయూ కార్యవర్గ ఎన్నికలు

నిజామాబాద్ అర్బన్: పీఆర్‌టీయూ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోనున్నారు. నగరంలోని బస్వ గార్డెన్‌లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 195 మంది ఓటర్లు ఉంటారు. వీరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. కాగా ఈ సంఘం నాయకులపై ఇటీవల అనేక ఆరోపణలు వచ్చాయి. బదిలీలు, పదోన్నతుల్లో తమ అనుచరులకే ప్రాధాన్యత ఇచ్చి, ముఖ్యమైన ప్రాంతాలు తీసుకున్నారని విమర్శలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ ముక్య నాయకుడు మాజీ ప్రజాప్రతినిధి రూ.25 లక్షలు తీసుకోవడం, 317 జీవో ప్రకారం జిల్లాకు రావాల్సిన టీచర్ల వద్ద డబ్బులు దండుకోవడం వంటి ఘటనలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆయా అంశాలు ప్రభావితం చూపనున్నాయి. ప్రధాన పదవులకు ముగ్గురు చొప్పున పోటీ చేస్తున్నారు. దీంతో ఎన్నిక రసవత్తరంగా సాగనుంది. అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రచ్చ మురళి, కృష్ణరెడ్డి బరిలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి వెంకటేశ్వర్‌గౌడ్, శంకర్, కిషన్ పోటీ పడుతున్నారు.



ఎడపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ చైర్మన్‌



సుభాష్‌నగర్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులకు రుణమాఫీ చేసినందుకు ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా సహకార సంఘాలు, రైతుల తరఫున మంత్రికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా సాంకేతిక సమస్యల కారణంగా సహకార సంఘాల్లో రుణమాఫీ వర్తించని రైతులకు కూడా మాఫీ అయ్యేలా చూడాలని మంత్రికి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రతిఒక్కరికీ రుణమాఫీ అయ్యేలా చూస్తామని హామీనిచ్చారని డీసీసీబీ చైర్మన్‌ రమేశ్‌రెడ్డి తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 27,315 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వా రా 400 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 19 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిషన్‌ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతోంది.

నిషేధిత మందులపై ‘ఖతర్‌’ నజర్‌

- భారతీయ వలస కార్మికులు నిషేధిత మందులు తెస్తున్నారని గుర్తించిన అక్కడి ప్రభుత్వం
- అవగాహన లేక కటకటాల పాలవుతున్న కార్మికులు



వలస కార్మికులకు అవగాహన కల్పిస్తున్న రాయబార కార్యాలయ అధికారులు(ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): ఖతర్‌లో నిషేధించిన కొన్ని రకాల మందులు, మాదక ద్రవ్యాలను భారత్‌ నుంచి వలస వచ్చే కార్మికులతో మెడికల్‌ మాఫియా రవాణా చేయిస్తుండడంతో అక్కడి ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఇప్పటి వరకే అనేక మంది భారతీయులు నిషేధిత మందులు, మాదకద్రవ్యాలతో పట్టుబడి కటకటాలపాలయ్యారు. గల్ఫ్‌ దేశాల్లోని చట్టాలు అత్యంత కఠినంగా ఉండగా, వాటిపై అవగాహన లేనివారు మాఫియా, దళారుల ఉచ్చులో చిక్కుకుని తెలియక చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తున్నారు. ఖతర్‌లోని రాయబార కార్యాలయం, ఇండియన్‌ కమ్యూనిటీ బెనివలెంట్‌ ఫోరమ్‌(ఐసీబీఎఫ్‌), ఎంబసీ ఆధ్వర్యంలో పని చేసే భారతీయ కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా ఈనెల 10న ఆన్‌లైన్‌లో సెమినార్‌ నిర్వహించారు. మన దేశంలోని తెలుగు రాష్ట్రాలతోపాటు, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్‌, బీహార్‌, హర్యానా తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు ఖతర్‌కు అధిక సంఖ్యలో వెళ్తున్నారు. కొందరు ఏజెంట్లు సైతం వీసాలు ఇచ్చి పంపే సమయంలో నిషేధిత సైకోయాక్టివ్‌, సైకోట్రోపిక్‌తోపాటు ఇతర మందులను పార్సిళ్లుగా తయారు చేసి రవాణా చేయిస్తున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఖతర్‌లోని మన దేశ రాయబారి విపుల్‌, ప్రథమ కార్యదర్శి ఈష్‌ సింఘాల్‌, ఐసీబీఎఫ్‌ అధ్యక్షుడు షానవాజ్‌.. వలస కార్మికులను అప్రమత్తం చేయడానికి విస్తృత ప్రయత్నాలు మొదలు పెట్టారు. నిషేధిత మందులు, డ్రగ్స్‌లో అరెస్టైన కార్మికుల కేస్‌ స్టడీస్‌ను ఈ సెమినార్‌లో వివరించారు.

ఖైదీలకు న్యాయ సహాయం

డ్రగ్స్‌ కేసుల్లో జైలు పాలైన భారతీయ వలస కార్మికులకు న్యాయ సహాయం, ఆర్థిక సాయం అందించేందుకు ఎంబసీతోపాటు, ఐసీబీఎఫ్‌, భారతీయ సంఘాలు ముందుకు వచ్చాయి. అత్యవసర పరిస్థితుల్లో జైలులో ఉన్న వలస కార్మికులకు ఆర్థిక సాయం కూడా అందించడానికి నిధులను సమీకరించారని స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. ఏది ఏమైనా ఖతర్‌తో పాటు ఇతర గల్ఫ్‌ దేశాలకు వలస వెళ్లే కార్మికులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని నిషేధిత మందులు, డ్రగ్స్‌ పార్సిళ్లను తీసుకువెళ్లకుండా ఉండటమే మేలని చెప్పడానికి రాయబార, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి.

సాయి సేవలో భక్తజన మండలి సభ్యులు



షిరిడిలోని సాయి ఆలయంలో కీర్తనలు ఆలపించిన భజన మండలి సభ్యులు



సభ్యులను సన్మానిస్తున్న సంస్థాన్‌ బాధ్యులు

నిజామాబాద్‌ రూరల్‌: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ షిరిడి సాయి భక్తజన మండలి సభ్యులు సాయిబాబా సేవలో తరిస్తున్నారు. ఈ భక్తజన మండలి 2022 మార్చి12న ఏర్పాటయ్యింది. రెండేళ్లుగా మండలి సభ్యులు గ్రామగ్రామాన ప్రతి ఇంటికి సాయి నామస్మరణ చేరేవిధంగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు వంద భజన కార్యక్రమాలు పూర్తి చేశారు. శతాబ్ది వేడుకగా 100వ భజన కీర్తన కార్యక్రమాన్ని ఇటీవల సాయిబాబా సన్నిధిన మహారాష్ట్రలోని షిరిడి పుర వీధుల్లో నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథుని చరిత్రను ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిరిడి సంస్థాన్‌ వారు భక్తజన మండలి సభ్యులను ఘనంగా సన్మానించారు. షిరిడి సంస్థాన్‌ వారి సత్కారం తమ జీవితాల్లో మరుపురాని ఘట్టమని భక్తజన మండలి ప్రధాన కార్యదర్శి వై స్వరూప రాణి పేర్కొన్నారు.

పరుగు పందెంలో ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీహరి

రుద్రూర్‌: జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో వి శ్రీహరి ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచాడు. కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్‌ జూనియర్‌ బాలుర కళాశాలలో శ్రీహరి ఎంపీసీ సెకండియర్‌ చదువుతున్నాడని ప్రిన్సిపల్‌ డాక్టర్‌ మహ్మద్‌ ముబీన్‌ తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక సౌత్‌ జోన్‌ స్టేట్‌ లెవల్‌ మీట్‌కు ఎంపికయ్యాడని, శ్రీహరి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీహరిని ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ బి సంజీవ్‌కుమార్‌, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికైన జిల్లా క్రికెట్‌ జట్టు

నిజామాబాద్‌నాగారం: జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి అండర్‌–19 విభాగంలో బాలుర జట్టు ఎంపికలను జీజీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చంద్రసేన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌రెడ్డి సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించి 25మందితో కూడిన ప్రాబబుల్స్‌ జట్టును ఎంపిక చేశారు. నాలుగు రోజులు శిక్షణ అనంతరం 15మందితో కూడిన తుది జాబితాను ఎంపిక చేసి వరంగల్‌లో నిర్వహించే టోర్నమెంట్‌కు పంపిస్తామని తెలిపారు. కోశాధికారి శ్రీనివాస్‌, కోచ్‌లు సురేశ్‌, పారస్‌, నయూమ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైన్‌షాపులు బంద్‌

ఖలీల్‌వాడి: గణేశ్‌ నిమజ్జన వేడుకల సందర్భంగా జిల్లాలోని వైన్‌షాపులు, బార్‌లు, కల్లు దుకాణాలను ఆదివారం మూసి ఉంచాలని సీపీ కల్మేశ్వర్‌ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి ఉంచాలని పేర్కొన్నారు.

రేపు ట్రాఫిక్‌ మళ్లింపు

ఖలీల్‌వాడి: మిలాద్‌–ఉన్‌–నబీ నేపథ్యంలో నిజామాబాద్‌ నగరంలో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు పలురూట్లలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు సీపీ కల్మేశ్వర్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్‌ వైపు నుంచి వచ్చే వాహనాలు అర్సపల్లి చౌరస్తా, అర్సపల్లి రైల్వే గేట్‌, న్యూ కలెక్టరేట్‌, కాలూర్‌ చౌరస్తా, ఖాజా హోటల్‌, బైపాస్‌, ఎన్టీఆర్‌ చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌ చేరుకోవాలని, బోధన్‌ వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్టాండ్‌, రైల్వే ఫ్లై ఓవర్‌, శివాజీచౌక్‌, నిజాంకాలనీ, అర్సపల్లి రైల్వే గేట్‌ మీదుగా బోధన్‌ వైపు వెళ్లాలని సూచించారు.

గణపతి ఉత్సవ సంకీర్తన



గీతాలు ఆలపిస్తున్న ఇస్కాన్‌ సభ్యులు

నిజామాబాద్‌ రూరల్‌: భాగవన్నామ సంకీర్తన అన్నింటికంటే ఉన్నతమైనదని ఇస్కాన్‌ కంతేశ్వర్‌ అధ్యక్షుడు రామానంద రాయ్‌ గౌరదాస్‌ అన్నారు. శనివారం నగరంలోని వినాయక్‌ నగర్‌లో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హైందవ సేన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామానంద రాయ్‌ ప్రవచనం ఇచ్చారు. కార్యక్రమంలో ఇస్కాన్‌ సభ్యులు నరేశ్‌, బలరాం దాస్‌, హైందవ సేన బాధ్యులు పురుషోత్తం రెడ్డి, శ్రీధర్‌, సుబ్బారెడ్డి, వెంకట్‌రావు, గంగారెడ్డి, రామకృష్ణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్‌, జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రూ.33 లక్షల విలువైన అల్ప్రాజోలం పట్టివేత

- ముగ్గురి అరెస్ట్‌, పరారీలో మరొకరు



ఎక్సైజ్‌ పోలీసుల అదుపులో నిందితులు

కామారెడ్డి క్రైం: కల్తీ కల్లు తయారు చేసేందుకు ఉపయోగించే 3.340 కిలోల అల్ప్రాజోలం మత్తుమందును అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠాను నిజామాబాద్‌ ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు శనివారం పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.33 లక్షల విలువైన అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐలు వెంకటేశ్‌, స్వప్న, షాకీర్‌ అహ్మద్‌ ఆధ్వర్యంలో సిబ్బంది నాగిరెడ్డిపేట మండలం వదల్‌పర్తి గ్రామానికి సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఎల్లారెడ్డి మండలం రుద్రారం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణగౌడ్‌, గాంధారికి చెందిన ప్రవీణ్‌ గౌడ్‌ నిషేధిత అల్ప్రాజోలంను బైక్‌పై తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నాగిరెడ్డిపేట మండలం మాసాన్‌పల్లికి చెందిన సిద్ధిరామాగౌడ్‌, బాబాగౌడ్‌ సైతం ఉన్నట్లు గుర్తించి సిద్ధిరామాగౌడ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ముగ్గురిని కామారెడ్డి ఎక్సైజ్‌ కార్యాలయానికి తరలించారు. బాబాగౌడ్‌ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్‌ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్‌ ఎస్సై నర్సింహచారి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

అప్పులు తీర్చేందుకు చైన్‌ స్నాచింగ్‌

- ఇద్దరి అరెస్ట్‌, రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై అనిల్‌

మాచారెడ్డి: జల్సాల కోసం చేసిన అప్పులను తీర్చేందుకు చైన్‌ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..ఈ నెల 2వ తేదీన గజ్యానాయక్‌ తండాలో నివాసముంటున్న పందిరి రాజవ్వ ఇంట్లోకి వెళ్లిన ఓ మహిళ ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఘన్‌పూర్‌కు చెందిన మ్యాడం సంతోష్‌, కృష్ణాజివాడికి చెందిన గుడిముందటి మానసను అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. కామారెడ్డిలోని ఓ బట్టల దుకాణంలో పని చేస్తున్న సమయంలో పరిచయమైన వీరిద్దరు జల్సాల కోసం అప్పులు చేస్తూ వాటిని తీర్చేందుకు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. శనివారం గజ్యా నాయక్‌ తండా చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పుస్తెల తాడును అమ్మేందుకు వెళ్తూ సంతోష్‌, మానస చిక్కారని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల నుంచి ముగ్గురి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఉన్న గౌతం నగర్‌ కు చెందిన రహీశాభాను అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లిన రహీశాభాను ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరుడు ఖాజా హుస్సేన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాక్లూర్‌కు చెందిన మహిళ..



భాగున్న

ఆర్మూర్‌: మాక్లూర్‌ మండల కేంద్రానికి చెందిన భాగున్న అనే మహిళ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేని భాగున్న ఈనెల 11న ఉదయం 7గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా భాగున్న ఆచూకీ లభించలేదు. ఆమె సోదరుడు మర్ల లక్ష్మణ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మల్లయ్యపల్లికి చెందిన యువతి

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లికి చెందిన భూమా మహేశ్వరి (18) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. తాము ఊరికి వెళ్లివచ్చేసరికి మహేశ్వరి కనిపించడం లేదని, ఆమె కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్‌ షాపులో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఉన్న ఓ మెడికల్‌ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గజానన్‌ మెడికల్‌ షాపు యజమాని బందేవార్‌ సంతోష్‌ శుక్రవారం రాత్రి 8.30గంటలకు దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసే సరికి షాపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దుండగులు కౌంటర్‌లో నుంచి 1.18లక్షల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

వేల్పూర్‌: మండల కేంద్రంలోని రామమందిరం గణేశ్‌ మండపంలో పేకాట ఆడుతున్న 13 మందిని శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై నాగ్‌నాథ్‌ శనివారం తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.70 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల విద్యుత్‌షాక్‌తో ఇద్దరు రైతులు మృతి

కామారెడ్డి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు రైతులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. గడ్డి కోస్తుండగా విద్యుత్‌ తీగకు కొడవలి తగిలి ఒకరు, బోరు మోటారు వద్ద సర్వీస్‌ వైరు చే యికి తగిలి మరొకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..

ఎల్లారెడ్డిపల్లిలో..



ఎల్లయ (ఫైల్‌)

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన రైతు ముక్కిరి ఎల్లయ్య(41) శనివారం గుండారం గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో బోరుమోటార్‌ వద్ద గడ్డిని కోస్తుండగా కొడవలి విద్యుత్‌తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

ధర్మారెడ్డి శివారులో..



జోడు కృష్ణ(ఫైల్‌)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు కృష్ణ(40) శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంటి ముందున్న పొలంలోకి వెళ్లి తిరిగిరాలేదు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వెతుకగా జోడు రాములు అనే వ్యక్తి పొలంలోని బోరుమోటారు వద్ద సర్వీసు వైరు అతని కుడి చేయికి తగిలి అక్కడికక్కడే మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య జోడు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి మృతి



గాండ్ల అశోక్‌(ఫైల్‌)

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన గాండ్ల అశోక్‌(32) ప్రమాదవశాత్తు కాకతీయకాలువలో పడి మృతి చెందాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రెండు రోజుల క్రితం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన అశోక్‌ తిరిగి రాలేదు. దీంతో పలుచోట్ల కుటుంబ సభ్యులు వెతికారు. శనివారం ఉదయం కాకతీయ కాలువ ఒడ్డున బైక్‌ ఉన్న ప్రదేశంలో నీటిలో వెతుకగా అశోక్‌ మృతదేహం లభించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కాంగ్రెస్‌ కార్యకర్త అయిన అశోక్‌ మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. అశోక్‌ మృతి పార్టీకి తీరని లోటన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.


చెరువులో మునిగి పశువుల కాపరి..

రుద్రూర్‌: గేదెల కోసం చెరువులోకి దిగిన పశువుల కాపరి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన పొతంగల్‌ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హంగర్గాకు చెందిన చాకలి పీరయ్య(50) గత కొన్నేళ్లుగా పశువుల కాపరిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం గేదెలు మేపడానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలిస్తుండగా చెరువు వద్ద పీరయ్య దుస్తులు కనిపించాయి. అప్పటికే చీకటిపడడంతో శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా పీరయ్య మృతదేహం లభించింది. చెరువులోకి దిగిన గేదెలను బయటకు కొట్టేందుకు నీటిలోకి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని మృతుడి భార్య నర్సవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి..

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలోని రైతుఫారం గ్రామానికి చెందిన బొంకన్‌పల్లి సాయిలు (55) ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. సాయిలు గ్రామానికి చెందిన పోచన్నతో కలిసి ఇంద్రనగర్‌ గ్రామం రోడ్డు పక్కన ఉన్న చెట్టెక్కి కొమ్మలను నరికివేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

దుబాయిలో గుండెపోటుతో..



సున్నం రమేశ్‌(ఫైల్‌)


ఇందల్వాయి: మండల కేంద్రానికి చెందిన సున్నం రమేశ్‌(30) దుబాయిలో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సున్నం నర్సింలు, భారతవ్వ మూడో కుమారుడైన రమేశ్‌ ఎనిమిదేళ్లుగా దుబాయికి వెళ్తున్నాడని, చివరి సారిగా ఏడాదిన్నర క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడన్నారు. విషయం తెలుసుకున్న రమేశ్‌ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. రమేశ్‌ మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సారంగాపూర్‌ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ మృతి చెందినట్లు ఎస్సై వెంకట్రావు శనివారం తెలిపారు. హాస్టల్‌లో ఉంటున్న కూతురి వద్దకు నవీపేట్‌ మండలం కోస్లికి చెందిన సంగీత(45) భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా సంగీత అక్కడికక్కడే మృతి చెందింది. బాధితకుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆవిరైన ఆశలు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- కొద్ది రోజుల్లో దుబాయి వెళ్లాల్సి ఉండగా ఘటన



నరేశ్‌ మృతదేహం

నవీపేట: చాలీచాలని సంపాదనతో బతుకీడుస్తున్న ఆ యువకుడు త్వరలోనే తన కష్టాలు దూరమవుతాయని, దుబాయికి వెళ్తున్నానని సంబురపడ్డాడు. కానీ తానొకటి తలిస్తే విధి మరొకటి తలచింది. రోడ్డు ప్రమాదం అతడిని బలితీసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అబ్బాపూర్‌(ఎం)కు చెందిన కదం నరేశ్‌ ఎడపల్లి మండలంలోని జానకంపేట పర్మిట్‌ రూమ్‌లో పని చేసేవాడు. చాలీచాలని వేతనంతో భార్య, కొడుకు పోషణ భారం కావడంతో దుబాయికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం తెలిసిన వారి వద్ద అప్పు చేసి నిజామాబాద్‌కు చెందిన ఏజెంట్‌కు రూ.65 వేలు చెల్లించాడు. 13న వీసా రావడంతో మరో రూ. 20వేలు చెల్లించాలని ఏజెంట్‌ సూచించాడు. డబ్బుల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్నేహితుల వద్దకు వెళ్లిన నరేశ్‌.. తిరుగు ప్రయాణంలో జానకంపేటలోని స్నేహితుల వద్ద కొద్దిసేపు ఆగాడు. టికెట్‌ కొనుగోలు చేసి కొద్ది రోజుల్లోనే దుబాయికి వెళ్తానని వారికి చెప్పాడు. ఇంటికి రాకపోవడంతో అదే సమయంలో నరేశ్‌కు అతడి భార్య లత ఫోన్‌ చేయగా, స్నేహితులతో ఉన్నా.. వస్తానని సమాధానం చెప్పాడు. తిరిగి 10గంటల సమయంలో ఆమె నరేశ్‌కు ఫోన్‌ చేయగా సమాధానం లేకపోవడంతో భయపడి తన బావ అరుణ్‌, చిన్న మామ గంగాధర్‌కు విషయం చెప్పింది. వారు జానకంపేటకు వెళ్లి విచారించగా అక్కడ లేకపోవడంతో బాసర రోడ్డు వెంబడి వెతుకుతుండగా జగ్గారావు ఫారం సమీపంలో బైక్‌ డివైడర్‌ను ఢీకొని పడిపోయింది. పక్కన పొదల్లో పడి ఉన్న నరేశ్‌ను చూసిన వారు.. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఏదైనా జంతువును తప్పించే క్రమంలో బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నట్లు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.